సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం । 26 । జూలై । 2023



విధుల్లో నిర్లక్ష్యం తగదు
విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా క్షయ నివారణ అధికారి విశ్వేశ్వర నాయుడు హెచ్చరించారు. 8లో



భూతల స్వర్గం
పర్యాటక ప్రాంతంగా గుర్తింపు పొందిన మోతుగూడెం పరిసరాల్లో ప్రకృతి అందాలు భూతల స్వర్గాన్ని తలపిస్తున్నాయి. 8లో



ఆశ్రమ పాఠశాల తనిఖీ
స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను రంపచోడవరం ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు తనిఖీ చేశారు. 8లో

న్యూస్‌రీల్

తెల్లవారిగూడెంకు విద్యుత్ సౌకర్యం

● ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ



మిడియం గుంపు గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఎండీ పృథ్వీతేజ

వీఆర్‌పురం : మండలంలో మారుమూల తెల్లవారిగూడెంలో ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ మంగళవారం పర్యటించారు. తొలుత కూనవరం – వీఆర్‌పురం మండలాల నడుమ శబరి నదిపై వీఆర్‌పురం మండలానికి విద్యుత్ సరఫరా చేసే 11 కేవీ లైన్‌ను పరిశీలించారు. వరద ఉధృతంగా ఉన్న సమయంలో తీసుకుంటున్న చర్యలు ఆయన సిబ్బంది నుంచి తెలుసుకున్నారు. అక్కడ నుంచి విద్యుత్ సరఫరా లేని కుందులూరు పంచాయతీ తెల్లవారిగూడెంలో పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడారు. విద్యుత్ లైన్ ఏర్పాటు చేసి గ్రామానికి సరఫరా చేయాలని విద్యుత్ సిబ్బందిని ఆయన ఆదేశించారు.అనంతరం కూనవరం మండలంలోని భీమవరం సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. చింతూరు ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, ఎస్‌ఈ టీవీఎస్ మూర్తి, ఈఈ యూసఫ్, ఇన్‌చార్జ్ ఏఈ పరశురాం పాల్గొన్నారు.

జెడ్పీ స్థాయీ సంఘ సమావేశం రేపు

మహారాణిపేట (విశాఖ): జెడ్పీ స్థాయీ సంఘ సమావేశం ఈనెల 27న నిర్వహించనున్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఒకటి నుంచి ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు జరుగుతాయని జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామ్మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు, ఉమ్మడి జిల్లా అధికారులు పాల్గొనాలని పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లి రూరల్: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు.మండల కేంద్రంలో మంగళవారం డివిజనల్ అటవీశాఖ కార్యాలయ ఆవరణలో జగనన్న పచ్చతోరణం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా కార్యలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తు తరాల కోసం మొక్కలు పెంచడంలో ప్రతి ఒక్కరు తోడ్పడాలని ఆమె అన్నారు. చింతపల్లిలో 60 రకాల మొక్కలు నాటే ప్రయత్నం జరుగుతుందని, త్వరలో దాన్ని పూర్తి చేస్తామని తెలిపారు.అలాగే ఆపరేషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు మొక్కలు పంపిణీ చేసామని దాని వలన మొక్కలు శాతం పెరిగి కాలుష్యం నివారించవచ్చని ఆమె పేర్కొన్నారు. ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత, డీఎఫ్‌వో సూర్యనారాయణ, సబ్ డీఎఫ్‌వో రాజు, ఎఫ్ఆర్‌వో చిట్టితల్లి, డీసీసీబీ చైర్మన్ సీతారాం, మండల అధ్యక్షులు మోరి రవి, ఎంపీటీసీ ధారలక్ష్మి, కోఆప్షన్ సభ్యులు నాజర్‌వలీ పాల్గొన్నారు.

ఒరిగిన లారీ.. తప్పిన ప్రమాదం



అదుపుతప్పిన లారీ

అనంతగిరి: మండలంలోని డముకు నిమ్మలపాడు రోడ్డు చెరుకుమడత సమీపంలోని మంగళవారం సాయంత్రం లారీ అదుపుతప్పి రోడ్డుపక్కకు ఒరిగిపోయింది. క్రషర్ డస్ట్‌తో వస్తున్న లారీ చెరుకుమడత సమీపంలో అదుపుతప్పింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పింది. డముకు-నిమ్మలపాడు రోడ్డులోని టవర్ పనులు నిమిత్తం గోతులు తవ్వడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోతులను మూసివేయాలని వాహనదారులు కోరుతున్నారు.

అప్రమత్తతే ఆరోగ్య రక్ష

వర్షాకాలం వచ్చేసింది. గిరిజన ప్రాంతాల్లో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. మారుతున్న వాతావరణ పరిస్థితులతో గిరిజన గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో అప్రమత్తతతోనే వాటికి దూరంగా ఉండవచ్చని వైద్యారోగ్యశాఖ అధికారులు సూచిస్తూ అవగాహన కల్పిస్తున్నారు.

- వర్షాకాలంలో పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు
- మలేరియా, టైఫాయిడ్, డయేరియా ప్రబలే అవకాశం
- అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



గిరిజన గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

ముంచంగిపుట్టు: ప్రస్తుత కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఎక్కడిపడితే అక్కడి మురుగునీరు నిలిచిపోవడంతో దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. వీటి మూలంగా మలేరియా, డెంగ్యూ సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వర్షాకాలంలో నీటిని వేడి చేయకుండా తాగడం వల్ల టైఫాయిడ్, డయేరియా వ్యాధుల బారిన పడుతుంటారు. ఈ సమయంలో ఆరోగ్య జాగ్రత్తలు పాటిస్తే రోగాలు దరి చేరవని వైద్యులు సూచిస్తున్నారు.

పెరుగుతున్న రోగుల తాకిడి

జిల్లాలో సీహెచ్‌సీ, పీహెచ్‌సీలకు రోగుల తాకిడి రోజురోజుకు పెరుగుతోంది. జ్వరం, దగ్గు, తలనొప్పి, విరేచనాలతో ఆరోగ్య కేంద్రాలకు రోగులు వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు.

● వ్యాధులు ప్రబలే గ్రామాల పట్ల వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టారు.మొదట పారిశుధ్య పనులను చేయిస్తున్నారు.యాంటీ లార్వా ఆపరేషన్‌ను నిర్వహిస్తున్నారు.మలేరియా నివారణ శాఖ ఆధ్వర్యంలో దోమల నివారణ మందును కాలువలు, మురుగు నిల్వ ఉండే ప్రదేశాల్లో పిచికారీ చేయిస్తున్నారు.

● జర్వాల ప్రభావం ఉండే గ్రామాల్లో పీహెచ్‌సీల వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి, రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. చాలా రోజులుగా జర్వాలతో బాధపడుతున్న వారి బ్లడ్ శాంపిళ్లు సేకరించి, ఆరోగ్య కేంద్రాల్లో రక్త పరీక్షలకు పంపిస్తున్నారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తున్నారు.

● ప్రభుత్వం అమలు చేస్తున్నా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా సైతం గ్రామాల్లో ఇంటింటికీ వైద్య సేవలు అందుతున్నాయి.

జిల్లా సమాచారం

మండలాలు	:	22
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	:	62
ఉప ఆరోగ్య కేంద్రాలు	:	352
కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు	:	5
ఏరియా ఆస్పత్రులు	:	3
జిల్లా ఆస్పత్రి	:	1
మలేరియా సబ్ యూనిట్లు	:	18
జనాభా		10.24 లక్షలు

● జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. మరగకాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచిస్తున్నారు.

పూర్తిస్థాయిలో వైద్యసేవలు



అన్ని ఆస్పత్రుల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున జ్వరం, దగ్గు, జలుబు వంటివి వచ్చే అవకాశాలు ఉన్నాయి.అనారోగ్యం బారిన పడితే వెంటనే వైద్యులను సంప్రదించాలి. వైద్యుల సలహాలు,సూచనలతో మందులు వాడితే సరిపోతుంది.ముఖ్యంగా మలేరియా,టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలితే అప్రమత్తంగా ఉండాలి.గ్రామాల్లో విస్తృతంగా వైద్య శిబిరాలు సైతం నిర్వహిస్తున్నాం. ఎపిడమిక్ సీజన్‌లో వచ్చే వ్యాధుల పట్ల జిల్లాలో అన్ని ఆరోగ్య కేంద్రాలను ముందస్తుగానే అలర్ట్ చేశాం.
– జమాల్‌బాషా, డీఎంహెచ్‌వో, పాడేరు

కొనసాగుతున్న వర్షాలు

- అత్యధికంగా ఎటపాకలో46.2 ఎంఎం
- అత్యల్పంగా కొయ్యూరులో 2.8 ఎంఎం వర్షపాతం నమోదు



పాడేరు మెయిన్‌రోడ్డులో కురుస్తున్న వర్షం



రామచంద్రపురం వద్ద ఉధృతంగా గోస్తనీ నది

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా వర్షాలు కొనసాగుతున్నాయి.కొన్ని చోట్ల కుండపోతగా కురుస్తుండడంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడుతోంది. జిల్లా కేంద్రమైన పాడేరుతో పాటు అనంతగిరి, ఎటపాక, అనంతగిరి, రాజవొమ్మంగి, కూనవరం, చింతూరు ప్రాంతాల్లో సోమవారం రాత్రంతా భారీ వర్షం కురిసింది. మంగళవారం ఉదయం నుంచి జిల్లాలో వర్షం కురిసింది. ఖరీఫ్ వ్యవసాయానికి మాత్రం ఎంతో మేలు చేస్తున్నాయని జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్ నందు తెలిపారు.

వర్షపాతం వివరాలిలా..

జిల్లాలోని ఎటపాకలో అత్యధికంగా 46.2 మిల్లీమీటర్లు వర్షపాతం అత్యల్పంగా కొయ్యూరులో 2.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అనంతగిరిలో 45.2 ఎంఎం, కూనవరంలో 42.6 ఎంఎం,చింతూరులో 26.6ఎంఎం,అరకులోయలో 20.4ఎంఎం, దేవీపట్నంలో 16 ఎంఎం, జి.మాడుగులలో 14.6ఎంఎం, గంగవరంలో 14ఎంఎం, చింతపల్లిలో 12.2 ఎంఎం, ముంచంగిపుట్టులో 11.4ఎంఎం, రంపచోడవరంలో 10.6ఎంఎం, వీఆర్‌పురంలో 9.6ఎంఎం, డుంబ్రిగుడలో 9.2 ఎంఎం, మారేడుమిల్లిలో 9.2 ఎంఎం, అడ్డతీగలలో 8.8ఎంఎం, జీకే వీధిలో 7.6 ఎంఎం, పెదబయలులో 7.6 ఎంఎం, హుకుంపేటలో 6.8ఎంఎం, పాడేరులో 6ఎంఎం, రాజవొమ్మంగిలో 5.6 ఎంఎం, వై.రామవరంలో 4.4 ఎంఎం చొప్పున మంగళవారం వర్షపాతం నమోదైందని అధికారవర్గాలు తెలిపాయి

పొంగిన గోస్తనీ.. నిలిచిన రాకపోకలు

అనంతగిరి: మండలంలో వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గెడ్డలు, వాగులు, నదులు పొంగిప్రవహించడంతో మారుమూల గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. మండలంలోని రామచంద్రపురం, జీలుగులపాడు, సారవానిపాలెం, కాశీపట్నం ఆనుకుని ఉన్న గోస్తనీ నది పొంగి ప్రవహించడంతో ఆయా గ్రామాలకు చెందిన గిరిజనులు ఇళ్లకే పరిమితమయ్యారు. అలాగే పినకోట, పెదకోట పంచాయతీలో గెడ్డలు పొంగి ప్రవహించడంతో తముటు, తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

ఆలయ అభివృద్ధికి వినతి



టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

సాక్షి,పాడేరు: పెదబయలు మండలంలోని మారుమూల గుంజివాడలో శిథిలావస్థకు చేరిన సీతారామ స్వామి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని టీడీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ కోరారు. మంగళవారం వారు విజయవాడలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. రూ.10 లక్షలతో ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే పాల్గుణ తెలిపారు.

గోస్తనీ అందాలు తిలకించేలా..

- చురుగ్గా జిప్‌లైన్ పనులు
- ఇప్పటికే బొర్రా గుహల వైపు నిర్మాణం పూర్తి
- కోయిటిగుడ వైపు మొదలు పెట్టిన పర్యాటకశాఖ



బొర్రా వైపు పూర్తయిన జిప్‌లైన్ స్ట్రక్చర్ పనులు

అనంతగిరి: సహజసిద్ధంగా ఏర్పడిన బొర్రాగుహల అందాలను తిలకించేందుకు, పర్యాటకులు ఆసక్తి చూపుతుంటారు. వీటిని ఆనుకుని ప్రవహిస్తున్న గోస్తని నది అందాలను తిలకిస్తూ, ఫొటోలు, సెల్ఫీలు దిగుతుంటారు. లోయ అందాలను దగ్గర నుంచి చూడడం అసాధ్యం.. దీనిని సుసాధ్యం చేసేలా పర్యాటకశాఖ సరికొత్త ఆలోచనతో జిప్‌లైన్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా సుమారు రూ. 35 లక్షలతో పనులు చేపట్టింది. బొర్రాగుహలు ఆనుకుని జిప్‌లైన్‌కు సంబంధించి ఇప్పటికే పిల్లర్, స్ట్రక్చర్ పనులు పూర్తయ్యాయి. గోస్తనీ లోయలను ఆనుకొని అవతల వైపు ఉన్న కోయిటిగుడ సమీపంలో పిల్లర్ పనులు మొదలయ్యాయి. పర్యాటక సీజన్ నాటికి అందుబాటులోకి వచ్చేలా పర్యాటక శాఖ చర్యలు చేపట్టింది. కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు పనులకు అవరోధంగా మారాయి.

కొద్దిరోజుల్లో అందుబాటులోకి..

పర్యాటకులు ఎదురుచూస్తున్న జిప్‌లైన్ కొద్దిరోజుల్లో అందుబాటులోకి రానుంది. వర్షాల కారణంగా పనులకు ఆటంకం కలిగింది. జిప్‌లైన్ అందుబాటులోకి వస్తే పర్యాటకులు మరిచిపోలేని అనుభూతిని పొందుతారని ఆశిస్తున్నాం.
– శ్రీనివాస్ పాణి, రీజినల్ డైరెక్టర్, పర్యాటకశాఖ

మోహరించిన బలగాలు

- 28 నుంచి ప్రారంభం కానున్న మావోయిస్టుల వారోత్సవాలు
- ముమ్మరంగా తనిఖీలు



సీలేరులో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

సీలేరు: మావోయిస్టుల వారోత్సవాలు ఈనెల 28 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో పోలీసు బలగాలు మోహరించాయి. ఏజెన్సీ సరిహద్దు పోలీసుస్టేషన్లలో అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారుల నుంచి ఇప్పటికే ఆదేశాలు వెలువడ్డాయి.ఈ నేపథ్యంలో పోలీసులు ఏజెన్సీ, సరిహద్దు ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. మంగళవారం గూడెం కొత్తవీధి సీఐ అశోక్‌కుమార్, సీఆర్‌పీఎఫ్ బలగాలు కలిసి సీలేరు పరిసర ప్రాంతాలు, జల విద్యుత్‌కేంద్రం , ఇతర ప్రభుత్వ శాఖల ప్రధాన కేంద్రాల వద్ద గస్తీ ఏర్పాటు చేశారు. వంతెనలు, చెక్‌డ్యాంల వద్ద తనిఖీలు నిర్వహించారు. విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులను విచారిస్తున్నారు.

లోతట్టు ప్రాంతాలకు వెళ్లొద్దు

రాజవొమ్మంగి: మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని లోతట్టు ప్రాంతాలకు వెళ్లవద్దని స్థానిక పోలీసులు మంగళవారం నోటీసులు అందజేశారు.

తగ్గిన వరద.. రాకపోకలు ప్రారంభం



సోకిలేరు వాగు వంతెనపై బురద తొలగింపు



ఫీవర్ సర్వే చేపడుతున్న వైద్యసిబ్బంది



చింతరేవుపల్లి -కన్నాయిగూడెం రహదారిపై నిలిచిన చెట్ల మొదులను తొలగిస్తున్న గ్రామస్తులు

చింతూరు: విలీన మండలాల్లో గోదావరి, శబరి నదుల వరద పూర్తిస్థాయిలో తగ్గుముఖం పట్టింది. దీంతో చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లో మంగళవారం రాకపోకలు యథాతథంగా కొనసాగాయి. కూనవరం, వీఆర్‌పురం మండలాల్లో గోదావరి క్రమేపీ తగ్గుతుండగా చింతూరు మండలంలో శబరినది కూడా తగ్గి ప్రస్తుతానికి వరదముప్పు తొలగడంతో నదీ పరివాహక గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ముంపునుంచి బయటపడిన రహదారులు

తెలంగాణలోని ప్రాజెక్టుల నీరు దిగువకు విడుదల చేయడంతో భద్రాచలం వద్ద గోదావరి తిరిగి స్వల్పంగా పెరిగింది. గోదావరి కేవలం రెండు, మూడు అడుగులు పెరిగి తగ్గే అవకాశముందని అధికారులు తెలిపారు. చింతూరు మండలంలో శబరినదితో పాటు సోకిలేరు, చంద్రవంక, జల్లివారిగూడెం , చీకటివాగుల వరద రహదారులను వీడాయి. దీంతో ఐదు రోజులుగా చింతూరు, వీఆర్‌పురం మండలాల నడుమ, చింతూరు మండలంలోని 20 గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి. ఐదు రోజులుగా నీరు నిలిచి ఉన్నందున చింతూరు మండలంలోని సోకిలేరు వాగుపై భారీగా బురద పేరుకుపోయింది. వాహనదారులు జారిపడే ప్రమాదముండడంతో అధికారులు ట్రాక్టర్ల సాయంతో బురదను తొలగించారు.

గ్రామాల్లో ఫీవర్ సర్వే : వరద తగ్గుముఖం పట్టడంతో నాలుగు మండలాల్లో వరద ప్రభావిత గ్రామాల్లో వైద్యశాఖ సిబ్బంది ముమ్మరంగా ఇంటింటా ఫీవర్ సర్వే చేపడుతున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి అందరికీ వైద్యపరీక్షలు నిర్వహించడంతో పాటు అనారోగ్యంగా ఉన్న వారికి మందులు అందజేస్తున్నారు. జ్వరాలు అధికంగా ఉన్న గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటుచేస్తున్నారు. మరోవైపు అంటువ్యాధులు ప్రబలకుండా ఆయా గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు.

వీఆర్‌పురం: గత రెండు రోజులుగా వరద నీరు తగ్గుముఖం పట్టడంతో గోదావరి,శబరి నదుల పరివాహక ప్రజలు ఊపిరి పీల్చుకొంటున్నారు.మంగళవారం వరద నీరు మరింత తగ్గుముఖం పట్టడంతో పలు గ్రామాల్లో నీటమునిగిన రహదారులు కొంత మేర బయట పడ్డాయి. సమీపగ్రామాల ప్రజలు రహదారుల వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్నారు.అలాగే వరద తగ్గుముఖం పట్టినప్పటికీ ఎగువన కురుస్తున్న వర్షాలతో పరివాహక గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండేలా సచివాలయ సిబ్బందితో పర్యవేక్షిస్తునట్లు తహసీల్దార్ ఎస్. శ్రీధర్ తెలిపారు.

ఆశ్రమ పాఠశాలలో ప్రవేశానికి డబ్బులు వసూలు

నూకూరు హెచ్‌ఎంపై శాఖాపరమైన చర్యలకు కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలు

సాక్షి, పాడేరు: హుకుంపేట మండలం సూకురు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతిలో ప్రవేశానికి రూ.700 వసూలు చేసి,వేరే పాఠశాలలో చేరమని విద్యార్థిని పంపేసిన హెచ్‌ఎంపై శాఖాపరమైన చర్యలకు కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం ఆదేశించారు.హుకుంపేట మండలంలోని జామిగుడ గ్రామానికి చెందిన సీదరి గణేష్ 8వతరగతిలో ప్రవేశానికి గాను తల్లితో కలిసి సూకూరు పాఠశాలకు మంగళవారం వెళ్లాడు. ప్రధానోపాధ్యాయుడు బైరాగి మజ్జిని సంప్రదించగా ప్రవేశం కల్పిస్తానని రూ.700 తీసుకుని బాకూరు ఆశ్రమ పాఠశాలలో చేరమని అక్కడ నుంచి పంపించినట్టు గణేష్ తల్లి రాత్రి 8గంటల సమయంలో కలెక్టరేట్‌కు చేరుకుని కలెక్టర్ సుమిత్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ వెంటనే స్పందించి ఏటీడబ్ల్యూవో ఎల్.రజనీతో మాట్లాడారు. హెచ్‌ఎంపై శాఖపరమైన చర్యలకు కలెక్టర్ ఆదేశించారు.

నేడు కలెక్టరేట్‌లో విచారణ: పాఠశాలలో ప్రవేశానికి రూ.700 వసూలు చేసి కూడా సీటు ఇవ్వకుండా మరో పాఠశాలలో చేరమని పంపిన హెచ్‌ఎంపై సమగ్ర విచారణకు కలెక్టర్ ఆదేశించారు. బుధవారం ఉదయం హెచ్‌ఎంతో పాటు,విద్యార్థి,తల్లిని కూడా కలెక్టరేట్‌లో హాజరుపరచాలని, డీడీ,ఏటీడబ్ల్యూవోలు కూడా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.విద్యార్థి సీదరి గణేష్‌కు సూకూరు పాఠశాలలోనే ప్రవేశం కల్పించి, హెచ్‌ఎం వసూలు చేసిన రూ. 700ను తల్లికి తిరిగి ఇప్పిస్తానని కలెక్టర్ తెలిపారు.

● మదిని దోచేస్తున్న మన్యం



అరకు పద్మాపురం జంక్షన్‌కు సమీపంలో కనువిందు చేస్తున్న హరివిల్లు



దుడుమ వ్యూ పాయింట్ నుంచి ప్రకృతి అందాలను తిలకిస్తున్న పర్యాటకులు



దడుమ జలపాతం సమీపంలో పొగమంచు అందాలు

మన్యంలో ప్రకృతి అందాలు కట్టిపడేస్తున్నాయి. ఒక పక్క ఎటుచూసినా పచ్చదనం.. మరోపక్క మేఘాలు దోబూచులాట.. శీతాకాలాన్ని తలపించేలా మంచు తెరలు ఇలా ఎన్నో అందాలకు నిలయంగా మారింది. అరకులోయ పద్మాపురం జంక్షన్ సమీపంలో పంట పొలాల వద్ద మంగళవారం ఉదయం సప్తవర్ణాలతో ఇంద్రధనస్సు కనువిందు చేసింది. ఆంధ్ర–ఒడిశా సరిహద్దులోని దుడుమ జలపాతం వద్ద భారీగా కురుస్తున్న పొగమంచు అందాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రాంతానికి ఒడిశా, ఆంధ్ర రాష్ట్రాల నుంచి పర్యాటకులు కుటుంబ సమేతంగా తరలివస్తున్నారు. – సాక్షి, పాడేరు/ముంచంగిపుట్టు

మన్యంలో ట్రైనీ కలెక్టర్ల బృందం పర్యటన



దల్లాపల్లి వ్యూపాయింట్‌ను సందర్శించిన ట్రైనీ కలెక్టర్లతో ఐటీడీఏ పీవో అభిషేక్



ట్రైనీ కలెక్టర్లతో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్ తదితరులు

సాక్షి,పాడేరు: పాడేరు ప్రాంతంలో పది మందితో కూడిన ట్రైనీ కలెక్టర్ల బృందం మంగళవారం పర్యటించింది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలుజేస్తున్న గిరిజనుల సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో బృందం సభ్యులు పరిశీలించారు. కాఫీ సాగుకు గుర్తింపు పొందిన మోదాపల్లి గ్రామాన్ని సందర్శించారు .ఇక్కడ కాఫీతోటలను పరిశీలించారు. కాఫీసాగు, అంతరపంట మిరియాల సాగు ద్వారా ఆదాయం, మార్కెటింగ్ వివరాలను ఐటీడీఏ పీవో వి.అభిషేక్ వారికి వివరించారు. దల్లాపల్లిలో వ్యూపాయింట్‌ను సందర్శించి ఇక్కడ ప్రకృతి అందాలను తిలకించారు. పాడేరులోని వన్‌ధన్ మార్ట్‌ను సందర్శించి, మోదకొండమ్మతల్లిని దర్శించుకున్నారు. బంగ్లాలో కలెక్టర్ సుమిత్‌కుమార్ వారితో సమావేశమయ్యారు. జిల్లా విస్తీర్ణం, గిరిజన ప్రజల జీవన విధానం, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను కలెక్టర్ వారికి వివరించారు. అనంతరం అరకులోయ పర్యటనకు వెళ్లారు.అక్కడ రాత్రి బస అనంతరం బుధవారం అరకులోయ,అనంతగిరి మండలాల్లో పర్యటిస్తారు.

క్లుప్తంగా

జగనన్న సురక్షలో 4328 ధ్రువపత్రాల పంపిణీ

● కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలోని ఐదు మండలాల పరిధిలోని తొమ్మి గ్రామ సచివాలయాల్లో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష పథకంలో ప్రత్యేక శిబిరాలు విజయవంతమయ్యాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. 8,149 గృహాలను సందర్శించిన వలంటీర్లు వివిధ ధ్రువపత్రాల నిమిత్తం 8,534 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారని ఆయన వివరించారు. సుమారు 4,328 ధ్రువపత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేసినట్టు ఆయన పేర్కొన్నారు.12 దరఖాస్తులు తిరస్కరించగా మిగిలిన ధ్రువపత్రాలను రెండు మూడు రోజుల్లో ఆయా సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు పంపిణీ చేస్తారని కలెక్టర్ వెల్లడించారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు

● జిల్లా క్షయ నివారణాధికారి విశ్వేశ్వరనాయుడు

హుకుంపేట: వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా క్షయ నివారణ అధికారి విశ్వేశ్వర నాయుడు హెచ్చరించారు. స్థానిక ఆస్పత్రిని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. హెల్త్ అసిస్టెంట్లు ఎల్.వీ.ఆర్ నాయుడు,ఎన్‌జీఎస్‌వీ ప్రసాద్ కొన్ని నెలలుగా విధులకు రావటం లేదని గుర్తించిన ఆయన వైద్యాధికారుల నుంచి వివరణ తీసుకున్నారు. విధుల్లో రాకుండా గైర్హాజరైన వారిపై కలెక్టర్‌కు నివేదించి, వారిని విధుల నుంచి తొలగిస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండే వైద్య సిబ్బంది విధులకు రాకుండా కాలయాపన చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. అనంతరం ఉర్రడా బొడ్డాపుట్టులో నిర్వహించే వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించి వైద్య పరీక్షలను పరిశీలించారు.

నర్సీపట్నంలో ఇరిగేషన్ ఈఈ కార్యాలయం ప్రారంభం

నర్సీపట్నం: జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ కార్యాలయాన్ని నర్సీపట్నంలో మంగళవారం ప్రారంభించారు. కార్యనిర్వాహక అధికారి బొత్సా శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు చేసి, కార్యాలయంలోకి అడుగుపెట్టారు. డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ ప్రేమానందరావు తనకు కేటాయించిన విధులు చేపట్టారు. ఇప్పటి వరకు జలవనరులశాఖ ఈఈ కార్యాలయం విశాఖపట్నంలో ఉండేది. ఇరిగేషన్ డివిజన్ల పునర్విభజన తర్వాత విశాఖపట్నం సబ్ డివిజన్‌కు పరిమితమైంది. నర్సీపట్నం, చోడవరంలలో ఇరిగేషన్ డివిజన్ కార్యాలయాల ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చోడవరంలో ఇప్పటికీ కార్యనిర్వాహక ఇంజినీర్ కార్యాలయం ఉండగా నర్సీపట్నంలో కొత్తగా ప్రారంభమైంది.

జగనన్న సురక్షతో సత్వర సేవలు



లబ్ధిదారుడికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు,గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న డిప్యూటీ కలెక్టర్ శర్మ, జెడ్పీటీసీ సభ్యురాలు రోషిణి

రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు

సాక్షి,పాడేరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలుజేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గిరిజనులకు సత్వర సేవలు అందుతున్నాయని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు తెలిపారు. గొండెలి,ఇరడాపల్లి సచివాలయాల పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ధ్రువీకరణ పత్రాల కోసం మండల కేంద్రాల్లో కార్యాలయాల చుట్టూ తిరగవలసి వచ్చేదని చెప్పారు. ఈకార్యక్రమంలో ప్రత్యేకాధికారి, గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు, గొండెలి,ఇరడాపల్లి సర్పంచ్‌లు పలాసి రూజమ్మ,గల్లెలి అశ్విజ, ఎంపీటీసీలు పలాసి రాజేశ్వరి,ముదిలి సుబ్బమ్మ,పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి తమర్భ వెంకటేశ్వర నాయుడు, సచివాలయల మండల కన్వీనర్ పలాసి కోటిబాబు, టెలికం సలహా మండలి సభ్యుడు ముదిలి త్రినాథ్, వైఎస్సార్‌సీపీ నాయకులు కూడా సింహచలం, డి.పి. రాంబాబు, తమర్భ బాబులునాయుడు తదితరులు పాల్గొన్నారు

అరకులోయ రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమంతో సమస్యలు సత్వరం పరిష్కారమవుతున్నట్టు డిప్యూటీ కలెక్టర్ శర్మ తెలిపారు. మండలంలోని పద్మాపురం పంచాయతీలో తహసీల్దార్ వేణుగోపాల్, గన్నెల పంచాయతీలో ఎంపీడీవో నగేష్ ఆధ్వర్యంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిప్యూటీ కలెక్టర్ శర్మ పద్మాపురం పంచాయతీలో 232, గన్నెల పంచాయతీలో 355 ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోషిణి, సర్పంచ్‌లు సుస్మిత,బొజ్జ, ఎంపీటీసీ సభ్యులు కుమారి, లలిత కుమారి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గురు,నాయకులు రఘునాథ్,సుంద్ర, డీటీ దొన్ను,సీడీపీవో శారద,ఏపీఎం అప్పయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పనులు చేయని కాంట్రాక్టర్లపై చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

సాక్షి, పాడేరు: ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలకు ముందుగా అడ్వాన్సులు తీసుకొని పనులు చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో పాడేరు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో భౌతికంగాను, రంపచోడవరం డివిజన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లోను సమీక్షించారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం జరిగితే చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతు భరోసా కేంద్రాలు, వెలెనెస్ సెంటర్ల నిర్మాణ పనులు పురోగతిపై సమీక్షించారు. ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. చింతపల్లి, జి.మాడుగుల, అరకు వ్యాలీ మండలాల్లో అడ్వాన్స్‌లు తీసుకొని పనులు చేయడం లేదని ఇంజనీరింగ్ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అటువంటి కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. పూర్తయిన భవనాలను సంబంధిత అధికారులకు అప్పగించాలని సూచించారు. రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, పంచాయతీరాజ్(పీఐయూ) ఈఈ కె.లావణ్యకుమార్, పీఆర్ ఈఈ టి.కొండయ్యపడాల్, వివిధ శాఖల డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణపై సమగ్ర సర్వే

రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం భన్సల్

అడ్డతీగల: ఓటరు జాబితా సవరణపై సమగ్ర సర్వే నిర్వహించాలని రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం భన్సల్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బూత్ లెవిల్ అధికారులు, ఇతర సిబ్బందితో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. పాత ఓటరు జాబితాల్లో ఏమైనా లోటుపాట్లు ఉంటే వెంటనే సరిచేయాలని సూచించారు. అవకతవకలు ఉంటే సమగ్ర వివరాలు సేకరించాలని ఆదేశించారు. కొత్త ఓట్లు నమోదుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. బీఎల్వోలతో పాటు ఎన్నికల కమిషన్ నియమిత సిబ్బందిని మాత్రమే సర్వేలో ఉపయోగించుకోవాలని సూచించారు. ఫారం 6,7,8,6బిని కచ్చితంగా పూర్తిచేసి వచ్చే నెలాఖరుకు సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ తాతారావు పాల్గొన్నారు.

సచివాలయాలతో చెంతనే సేవలు

ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి



సంకాడలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

గూడెంకొత్తవీధి: సచివాలయాల ఏర్పాటుతో ఊరిలోనే సేవలందుతున్నాయని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి తెలిపారు. సంకాడ సచివాలయ భవనాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయాల ద్వారా 500 పైగా సేవలు అందుతున్నాయని తెలిపారు. సచివాలయాల ఏర్పాటు వల్ల మండల కేంద్రాలకు వెళ్లే బాధ తప్పిందన్నారు. సచివాలయాల సేవలను అంతా సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేశగిరి నాగులమ్మ, ఎంపీపీ బోయిన కుమారి, వైస్ ఎంపీపీలు దేవుడు,ఆనంద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, నాయకులు కంకిపాటి గిరిప్రసాద్,అంజి, మామిడి చంద్రరావు,ఆనందరావు, లక్ష్మణరావు, కృష్ణపడాల్, జర్తా బాలరాజు, అప్పారావు, కోటేశ్వరరావు,గెమ్మెు,లోవరాజు పాల్గొన్నారు

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి

● బాధిత కుటుంబాలకు రూ.7 కోట్ల చొప్పున నష్ట పరిహారం
● డీఎల్వో జాతీయ అధ్యక్షుడు చెండా ఏలియా డిమాండ్



మాట్లాడుతున్న దండకారణ్య విమోచన సమితి జాతీయ అధ్యక్షుడు చెండా ఏలియా, ఇతర నాయకులు

సాక్షి,పాడేరు: భారతదేశ ఆదివాసీలపై అప్రకటిత యుద్ధం ఆపాలని, మణిపూర్ రాష్ట్రంలో వెంటనే రాష్ట్రపతి పాలన విధించాలని దండకారణ్య విమోచన సమితి జాతీయ అధ్యక్షుడు చెండా ఏలియా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సంఘ నేతలతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. మణిపూర్‌లో ఆదివాసీలకు అన్యాయం జరుగుతోందన్నారు. మహిళలను నగ్నంగా ఊరేగించడం,సామూహికంగా అత్యాచారానికి పాల్పడడం వంటి ఘటనలు అత్యంత హేయమైన చర్యలుగా ఆదివాసీ సమాజం ఖండిస్తుందన్నారు. భారత రాజ్యాధికారం కై వసం చేసుకుంటామని వర్గ పోరాటం చేసే మావోయిస్టులను దేశద్రోహులుగా ముద్రవేస్తున్నారని, వారి చరిత్రలో కూడా ఇలాంటి దుష్పరిణామాలు జరగలేదన్నారు. మణిపూర్‌లో పది వేలమంది కేంద్ర పారామిలిటరీ దళాల మధ్య సంపన్న వర్గ దుండగులు సుమారు మూడు నెలలుగా సమాచార వ్యవస్థను పూర్తిగా నిలిపివేశారు. ఆదివాసీ దూడెంలపై పడి మహిళలను వివస్త్రలను చేసి విచక్షణ రహితంగా మరణాయుధాలతో దాడులు చేస్తుంటే కేంద్ర పాలకులు చోద్యం చూస్తున్నారని ఆయన ఆరోపించారు. మణిపూర్ ఆదివాసీలపై జరుగుతున్న దాడులపై భారత రాష్ట్రపతి తక్షణమే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు.మణిపూర్ ఆదివాసీలపై ప్రభుత్వం చేస్తున్న అప్రకటిత యుద్ధాన్ని ఆపాలని, తక్షణమే రాష్ట్రపతి పాలన విధించి, రక్షణ నిమిత్తం ఆదివాసీలకు ఆయుధాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలకు చెందిన మృతుల కుటుంబాలకు ఒకొక్కరికి రూ.7 కోట్ల చొప్పున ఆయా బాధిత కుటుంబాలకు నష్టపరిహారాన్ని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్వో రాష్ట్ర అధ్యక్షుడు పి.రంజిత్‌కుమార్ ,డీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.జాన్‌బాబు, ఏపీసీఎల్‌సీ మాజీ కార్యదర్శి ఎస్.సుగునాథం పాల్గొన్నారు.

13 ఏళ్లకు దొరికారు..

2010లో జరిగిన హత్య కేసులో ముగ్గురు నిందితుల పట్టివేత



పట్టుబడిన ముగ్గురు నిందితులతో పోలీసులు

కొయ్యూరు : బూదరాళ్ల పంచాయతీ చల్దిగెడ్డలో 2010లో జరిగిన హత్య కేసులో 13 సంవత్సరాలుగా తప్పించుకు తిరుగుతున్న ముగ్గురు నిందితులను కొయ్యూరు సీఐ స్వామినాయుడు, మంప ఎస్‌ఐ లోకేష్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. వారిని రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను సీఐ మంగళవారం సాయంత్రం విలేకరులకు తెలిపారు.

భూ వివాదం కారణంగా 2010లో మంప స్టేషన్ పరిధిలో చల్దిగెడ్డ సమీపంలో కొత్తపల్లికి చెందిన బొంజిబాబు హత్య జరిగింది. తూములోవ, చల్దిగెడ్డకు చెందిన ఆరుగురు వ్యక్తులు కలిసి బొంజిబాబును చంపినట్టుగా పోలీసులు నిర్ధారించారు. ఈ కేసులో ఇప్పటి వరకు కొత్తపల్లికి చెందిన కొర్రా త్రినాథ్, బుజ్జిబాబు, మరొకరిని అరెస్టు చేశారు. మిగిలిన వారి కోసం ఆచూకీ తెలుసుకుని వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. కొత్తపల్లికి చెందిన గెమ్మెలి రాంబాబు, తూములోవకు చెందిన గెమ్మెలి బుజ్జిబాబు, అదే గ్రామానికి చెందిన పాంగి అప్పారావును బుధవారం అరెస్ట్ చేశారు. వారిలో ఒకరిని కొత్తపల్లి సమీపంలోను, మరొకరిని కాకరపాడు–ములకలపాడు సమీపంలో, మరికరిని మైదాన ప్రాంతంలో పట్టుకున్నారు. ఈ కేసులో మిగిలిన ముగ్గురు నిందితులు 13 ఏళ్లుగా తప్పించుకుని తిరిగారని, ఎట్టకేలకు వారి ఆచూకీ తెలుసుకుని సిబ్బంది సహకారంతో పట్టుకున్నామని సీఐ స్వామినాయుడు వివరించారు.

జి.మాడుగుల పీహెచ్‌సీని సందర్శించిన జాతీయ వైద్య బృందం



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ ఇలంగోవన్, నిమిత్, కుబావత్ బృందం



బృందం సభ్యులను సన్మానిస్తున్న వైద్యధికారులు శశికాంత్, రవిచంద్రశేఖర్

జి.మాడుగుల: స్థానిక పీహెచ్‌సీని ఢిల్లీకి చెందిన నేషనల్ హెల్త్ రీసెర్చ్ సెంటర్ వైద్య బృందం మంగళవారం సందర్శించింది. ఆరోగ్య కేంద్రంలో అమలవుతున్న సేవలు, రికార్డుల నిర్వహణ, సదుపాయాలు, వైద్య సిబ్బంది పనితీరుపై మంగళ, బుధవారాలు రెండు రోజుల పాటు ఈ బృందం పరిశీలించనుంది. గర్భిణులకు చేస్తున్న వైద్య పరీక్షలు, ఏఎన్‌ఎంలు, అంబులెన్సుల సేవలకు సంబంధించిన రికార్డులను డాక్టర్ ఆర్.ఇలంగోవన్, డాక్టర్ నిమిత్, డాక్టర్ కుబావత్‌లు పరిశీలించారు.

వైద్య బృందం సభ్యులకు పీహెచ్‌సీ వైద్యాధికార్లు, సిబ్బంది ఘన స్వాగతం పలికి, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌పీ వైద్యాధికార్లు డాక్టర్ రాకేష్, డాక్టర్ లలిత, డాక్టర్ శశికాంత్, డాక్టర్ రవిచంద్రశేఖర్,ఎంపీహెచ్‌ఈవో ఎస్.ప్రకాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల కోసం ఏజెన్సీ డీఈవోకు వినతి



ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావుకు వినతి పత్రం ఇస్తున్న కొచ్చావారివీధి మహిళలు

అడ్డతీగల: మండలంలో కొచ్చావారివీధిలో పాఠశాల ఏర్పాటు చేసి, ఉపాధ్యాయుడిని నియమించాలని గ్రామ గిరిజన మహిళలు ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావుకు విజ్ఞప్తి చేశారు. గంగవరంలో డీఈవోను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ గ్రామానికి చెంది 24 మంది చిన్నారులు నిత్యం మడేరు వాగును దాటుకుని రెండు కిలోమీటర్లు దూరం కాలినడకన వెళ్లి కోనలోవ మండల పరిషత్ పాఠశాలలో చదువుకోవలసి వస్తోందని వారు చెప్పారు. వాగును దాటే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వాగు ఉధృతంగా ప్రవహిస్తే ఆరోజు పాఠశాలకు వెళ్లే పరిస్థితి లేదన్నారు. అందువల్ల తమ గ్రామంలో పాఠశాలను ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఉన్నతాధికారులకు నివేదించి అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని డీఈవో వారికి హామీ ఇచ్చారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ

గంగవరం : స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను రంపచోడవరం ఏజెన్సీ జిల్లా విద్యాశాఖాధికారి (ఏజెన్సీ డీఈవో) వై.మల్లేశ్వరరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల తరగతులను, వసతి గృహం ఆవరణలను ఆయన పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థుల ప్రగతి, విద్యా సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, హెచ్‌ఎం, సబ్జెక్టు ఉపాధ్యాయులను సూచించారు. జగనన్న విద్యా దీవెన కిట్లు అందాయా లేదా అనేది విద్యార్థుల నుంచి తెలుసుకున్నారు. భోజన వంటకాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గంగవరం ఆశ్రమ బాలికల పాఠశాలలో జరుగుతన్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు అంశాలను వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీహేన్సన్, డిప్యూటీ వార్డెన్ లక్ష్మీకాంత, పీఈటీ పద్మావతి ఉన్నారు.

● భూతల స్వర్గం




పోర్‌బై జలాశయాన్ని కమ్మేసిన పొగమంచు



పోర్‌బై వద్ద కొండలపై పొగమంచు

పర్యాటక ప్రాంతంగా గుర్తింపు పొందిన మోతుగూడెం పరిసరాల్లో ప్రకృతి అందాలు భూతల స్వర్గాన్ని తలపిస్తున్నాయి. పొగమంచు అందాలు.. పొల్లూరు జలపాతం పరవళ్లు ప్రకృతి ప్రేమికులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి.

– మోతుగూడెం



పాలనురుగలా ప్రవహిస్తున్న పొల్లూరు జలపాతం

సాక్షి క్లాసిఫైడ్స్

Education

ONE SITTING
■ ONE SITTING 10th, 12th, B.A., B.Com., B.Sc., M.A., M.Com., M.Sc., B.Ed., BBA, BCA, MBA, Nursing Pharmacy, Dip. In VET. B.Tech., from Recog., Universities in India. (for Discont.) Exam in August. ✆ : 73383 76874 [R-60]

Real Estate

PLOT FOR SALE
■ VUDA Approved Site 200 Sq.yds 50x30 West Facing Besides Panorama gated Community at Yendada. VSP. Ph : 98482 61476 [V- 2049]
■ VUDA Approved LRS Site 300 Sq.yds 45x60 North East Facing, Near Visakha Inst. of Engg College, Peda Narava. Ph : 85559 90989 [V- 2050]
■ లక్షో 100చ॥గ॥ VMRDA ప్లాట్ మిగిలినవి వడ్డీలేని వాయిదాలు, పెందుర్తిలో, 11వేలకేPlots, కొత్తవలస, సబ్బవరం, అమృతపురం లలో Flat @3200 Sft. ఫోన్: 9581520402, 9110542138 [HA-428]

TO-LET
■ డూప్లెక్స్ ఫ్లాట్ అద్దె కొరకు ఆధునిక వసతులతో కూడిన 3140 SFT ఫుల్లీ ఫర్నిషెడ్ మరియు డబుల్ కార్ పార్కింగ్ కలిగిన డూప్లెక్స్ ఫ్లాట్ LIC క్వార్టర్స్ వెనుక కె.ఆర్.ఎం.కాలనీ, విశాఖపట్నంలో అద్దెకొరకు కలదు. 9182137769, 9849398894 [S-1195998]

Services

GOLD LOANS
■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 10745]

SEPTIC TANK CLEAN
■ సుధాకర్ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్స్ హైటెక్ మిషన్‌తో అతితక్కువ ఖర్చుతో ఇరుగుపొరుగు వారికి ఎటువంటి దుర్వాసన లేకుండా 10 ని॥ల్లో క్లీన్ చేయబడును. ఫోన్ : 98488 06516, 90149 03518 [V-2040]

Wanted
■ ప్రముఖుల ఇళ్ల వద్దనే ఉండి వృద్ధులను, బెడ్ పేషెంట్లను చూసుకొనుటకు M/F కేర్ టేకర్స్, ఆయాలు, నర్సులు కావలెను. జీతం: 14-20K, వసతి + భోజనం, VJA. ✆ 91608 35559, 78158 35561 [B-249]
■ ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 9676414393. [M-1221469]
■ Wanted Field Executives and Telecallers to Work in Banking Sector, Good Salary + Incentives. Time : 10 am to 6 pm. Ph : 79013 33864 [V- 794680]
■ Wanted Teachers Higher Classes : Maths, Physical Science Springdalls Public School, New Gajuwaka. Ph : 98481 99867 [V- 797245]
■ విశాఖపట్నం సిటీలో పనిచేయుటకు Male సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 8 గం॥ 26 రోజులు, జీతం : 15,500/- వ॥ 45 సం॥లోపు, 10th. పాస్ & సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ అనుభవం కలిగిన వ॥ 50 సం॥లోపు, 10th. పాస్ జీతం : 24,000/- డ్యూటీ సమయం 12 గం॥. అర్జెంటుగా కావలెను. ఫోన్: 81084 43534, 99599 25735 [V- 10883]
■ NBFC / Banking లో వర్క్ చేయుటకు రికవరీ ఎగ్జిక్యూటివ్స్, కలక్షన్ ఎగ్జిక్యూటివ్స్ & టెలికాలర్స్ (కంప్యూటర్ నాలెడ్జి ఉండాలి) కావలెను. సంప్ర : 89850 39037, 99662 04274 [V- 797235]
■ Job Opportunity : లీగాలిటీ ఉన్న లే అవుట్స్ కొత్తవలస / విజయనగరం / భోగాపురం / ఆనందపురంలో రెడీ టు కన్‌స్ట్రక్షన్ Plots కలవు. ఫుల్ / పార్ట్ టైమ్‌గా పనిచేయుటకు రిటైర్డ్ / VRS & గృహిణులు కావలెను. 2-5 లక్షలు సంపాదించుకొనే అవకాశం. వయస్సు : 30 సం॥ & ఆపైన. ఫోన్: 73308 11149 [V- 2769]
■ ఇన్సూరెన్స్ ఏజంట్స్ & మార్కెటింగ్ వారికి జీతం+ఇన్సెంటివ్స్ 40 వేలు. క్రొత్త యూనిట్‌లో డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా కావలెను. బ్యాంకు అనుబంధ సంస్థలో. వ: 25-60 ✆ 90524 70111 [B-283]
■ జాబ్స్ : సెక్యూరిటీ గార్డులు, జీతం : 10వేలు, డ్యూటీ 8 గంటలు, చదువు+ అనుభవం కావలెను. గాజువాక, ఆటోనగర్ ✆ 85002 68673, 94941 16446 [B-287]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!! సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

• అద్దెకు • అమ్మకం • రియల్ ఎస్టేట్ • ఫర్నీచర్స్ • ఆటోమొబైల్స్ • కంప్యూటర్స్ • సర్వీసెస్ • కావలెను

అనకాపల్లి	:9010546644
యలమంచిలి	:9951602901
చోడవరం	:9010210265
నర్సీపట్నం	:9010234557
పాడేరు	:9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

భారత ప్రభుత్వము, మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్

డెట్స్ రికవరీ ట్రిబ్యునల్

రికవరీ ఆఫీసర్ కార్యాలయం: 31-31-21, నారాయణ భవనం, సాయిబాబా వీధి, దాబాగార్డెన్స్, విశాఖపట్నం - 530020. ఇ-మెయిల్ ఐడి: ro2.drtvpatnam@gmail.com. ఫోన్: 0891-2957045

ప్రొక్లమేషన్ ఆఫ్ సేల్ - కమ్ - ఇ-వేలం అమ్మకపు నోటీసు

(ఆదాయపన్ను చట్టం 1961 యొక్క రెండవ షెడ్యూలు రూల్ 52(2) చూడుము)

RP/314/2019 in OA/177/2019

(1) కెనరా బ్యాంక్ (ఇ-సిండికేట్ బ్యాంక్) దాబాగార్డెన్స్ బ్రాంచ్, విశాఖపట్నం వర్సెస్ M/s అరెంజ్ హోమ్ డెకార్స్ అండ్ ఫర్నీచర్ మరియు ఇతరుల మధ్యనున్న ఒ.ఎ. నెం.177/2019 నకు సంబంధించి బ్యాంకులు మరియు ఫైనాన్షియల్ సంస్థలు బాకీలు వసూలు చట్టం 1993 యొక్క సెక్షన్ 19(22) పరిధిలోని గౌరవనీయ ప్రిసైడింగ్ అధికారి, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం వారిచే రికవరీ సర్టిఫికెట్ 25.02.2020 తేదిన జారీచేయబడినది & దానిని అమలు పరచు నిమిత్తం క్రింద సంతకందారునికి పంపబడినది.

(2) రికవరీ సర్టిఫికెట్‌లో సూచించిన రూ.3,22,17,364/- (అక్షరాల మూడు కోట్ల ఇరవై రెండు లక్షల పదిహేడు వేల మూడు వందల అరవై నాలుగు రూపాయలు) తో వడ్డీ, ఖర్చులు వగైరా ఈ క్రింది సర్టిఫికెట్ డెటార్స్ నుండి వసూలు చేయుటకు ఆర్.పి. నెం.314/2019 నందలి తీర్మానములు అమలు పరచుటకు క్రింది సంతకందారు చర్యలు చేపట్టినారు.

(CD-1) M/s. అరెంజ్ హోమ్ డెకార్స్ అండ్ ఫర్నీచర్, మేనేజింగ్ పార్ట్‌నర్ శ్రీ పిన్నంరాజు బుచ్చి వెంకట సత్యచంద్ర శ్రీనివాసరాజు మరియు పార్ట్‌నర్: శ్రీమతి పిన్నంరాజు జ్యోతి, ఫ్లాట్ నెం. G-3 & G-4, [illegible], సిద్ధార్థ రెసిడెన్సీ ఎదురుగా, ద్వారకానగర్, 3వ లేన్, విశాఖపట్నం లేదా ఫ్లాట్ నెం. 311, అక్షయ [illegible], మోర్ సూపర్ మార్కెట్ ఎదురుగా, విశాఖపట్నం-530016.

(CD-2) శ్రీ పిన్నంరాజు బుచ్చి వెంకట సత్యచంద్ర శ్రీనివాసరాజు, తండ్రి: లేటు సూర్యనారాయణరాజు, ఫ్లాట్ నెం. 101, సుక్షేత్ర ఫ్రంట్ అపార్ట్‌మెంట్స్, [illegible], సాగర్ నగర్, యండాడ, విశాఖపట్నం-530045.

(CD-3) శ్రీమతి పిన్నంరాజు జ్యోతి, భర్త: లేటు సూర్యనారాయణరాజు, ఫ్లాట్ నెం. 202, సుక్షేత్ర ఫ్రంట్ అపార్ట్‌మెంట్స్, [illegible], సాగర్ నగర్, యండాడ, విశాఖపట్నం-530045.

(CD-4) శ్రీ [illegible] రామ గోవింద్, తండ్రి: వెంకట రమణ, హెచ్.నెం 1-4A, ఎస్.రాయవరం మండలం, [illegible], విశాఖపట్నం-531055.

(3) తేది 20.01.2023 నాటికి బకాయి రూ. 2,89,31,525.27 (తేది 20.01.2023 వరకు వడ్డీ లెక్కించబడినది) + భవిష్య వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు వగైరాలు పొందుటకు రికవరీ ప్రొసీడింగ్స్ ప్రారంభించడమైనది.

(4) సర్టిఫికెట్ డెటార్స్‌కి చెందిన షెడ్యూలు ఆస్తులు, క్రింద తెలిపిన సర్వీస్ ప్రొవైడర్ ఏర్పరచిన వెబ్‌సైట్ https://www.bankeauctions.com ద్వారా ఆన్‌లైన్ ఇ-వేలం అమ్మకంచే రికవరీ సర్టిఫికెట్ సంతృప్తి మేరకు విక్రయించుటకు నిర్ణయించడమైనది. వేలం తేది, సమయం, బిడ్ ఫామ్ దాఖలు చేయు ఆఖరి తేది, రిజర్వు ధర, బయానా, బిడ్ పెంపు మొత్తం మొదలవి ప్రతి ఐటమ్ / షెడ్యూలు దిగువ సూచించడమైనది.

బిడ్లు సమర్పించుటకు చివరి తేది: 30.08.2023, సా॥ 4 గం.ల వరకు | వేలం తేది: 01.09.2023

షెడ్యూలు & ఐటమ్ నెం.	ఆస్తి విస్తీర్ణం	రిజర్వు ధర	ధరావత్తు సొమ్ము	బిడ్ పెంపుదల	వేలం సమయం*
షెడ్యూల్-బి లోని ఐటమ్ నెం.2	ఎ. 1.44 సెంట్లు వ్యవసాయ భూమి	రూ. 60,00,000/-	రూ. 6,00,000/-	రూ. 50,000/-	ఉ॥11.00 గం.ల నుండి మ॥ 12.00 గం.లవరకు

* ఇ-వేలం సమయం - ఆటో ఎక్స్‌టెన్షన్ పద్ధతిలో ప్రతి సారి 5 నిమిషములు పొడిగించబడుతుంది అనగా ఇ-వేలం సమయం ముగిసేముందు బిడ్ వేసినచో వేలం 5 నిమిషములు పొడిగించబడుతుంది.

(5) సర్వీస్ ప్రొవైడర్ వెబ్‌సైట్ https://www.bankeauctions.com ద్వారా ఆన్‌లైన్ ఇ-వేలం నందు పాల్గొనవలసిందిగా ప్రజలను ఆహ్వానించడమైనది. సర్వీస్ ప్రొవైడర్ వివరములు: మెస్సర్స్ సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, సంప్రదించవలసిన వ్యక్తి పేరు: శ్రీ ధరణి కృష్ణ, ఫోన్: 9948182222, ఇ-మెయిల్: andhra@c1india.com

(6) ఆసక్తి గల బిడ్డర్లు / పాల్గొనువారు ఇ-వేలం అమ్మకానికి సంబంధించిన నియమ నిబంధనలు, పూర్తి వివరాలు కొరకు వెబ్‌సైట్ https://www.bankeauctions.com ద్వారా పరిశీలించవలసినదిగాను మరియు బిడ్‌ఫారమ్‌లు దాఖలు చేయుటకు మరియు ఇ-వేలం నందు పాల్గొనుటకు అవసరమైన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, యూజర్ ఐడి, పాస్‌వర్డ్ సహాయం, విధానం, ఆన్‌లైన్ శిక్షణ కొరకు సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించవలసినదిగా సలహా సూచించడమైనది.

(7) [illegible] 9209272434, IFSC Code:CNRB0013844 [illegible] 31.08.2023 [illegible]

(8) [illegible] 9440905181, 0891-2788870, [illegible] cb13844@canarabank.com [illegible]

షెడ్యూలు ఆస్తి వివరములు

[illegible] 12-07-2023 [illegible]

సం/- [illegible] రికవరీ ఆఫీసర్-II, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం